ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 361 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 8 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## హెచ్‌సీయూ విద్యార్థులపై
# కేసుల ఎత్తివేత

### కంచె గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిటిషన్
### టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో మంత్రుల భేటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** హెచ్‌సీయూవిద్యార్థులపై నమోదు చేసిన కేసులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నీర్ణయం తీసుకుంది. హెచ్ సీయూ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులపై ఏ కేసులు అయితే నమోదయ్యాయో వాటిని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంపై హెచ్ సీయూ విద్యార్థులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. కంచ భూముల్ని అభివృద్ధి పేరుతో విక్రయిస్తే ఊరుకోబోమంటూ తెలంగాణ సర్కారును హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే దానికి సంబంధించి అక్కడ ప్రభుత్వం చేపట్టబోతున్న చర్యలను కొన్ని రోజుల క్రితం అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే వారిపై కేసులు నమోదయ్యాయి. వీటిని తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు ఈరోజు(సోమవారం) స్పష్టం చేయడంతో విద్యార్థులకు ఊరట లభించింది.

#### మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం

కంచె గచ్చిబౌలి సమస్యపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సెక్రటేరియట్ లోసమావేశమైంది. ఈ భేటీలో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ నటరాజన్ తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి యూనివర్శిటీస్ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ సభ్యులు హాజరయ్యారు. ఈ మేరకు పలు విజ్ఞప్తులు చేశారు టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ సభ్యులు. ఇందులో విద్యార్థులపై కేసులతో పాటు యూనివర్శిటీ క్యాంపస్ నుంచి పోలీస్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకుంది ప్రభుత్వం. జ్యూడిషియల్ రిమాండ్ లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొంది.

ఇదిలా ఉంచితే, కంచ భూముల వ్యహహారం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఇటీవల కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించిన సంగతి తెలిసిందే.. తమ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆ భూముల్లో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను నిలిపివేయాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చట్టాన్ని ఎలా మీ చేతుల్లోకి తీసుకుంటారంటూ ప్రశ్నించింది. కేవలం మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లను కొట్టేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టిన ధర్మాసనం.. ఇది చాలా తీవ్రమైన విషయమని, అంత అత్యవసరం ఏమొచ్చిందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది.




## సింగపూర్‌తో
# కలసి పనిచేస్తాం

### ఫ్యూచర్ సిటీ, స్కిల్ వర్సిటీల ఏర్పాటు
### సింగపూర్ ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు


**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఐటి పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధార్ బాబు అన్నారు. ఇందుకోసం శరవేగంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈక్రమంలో తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజనీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధుల బృందం సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును

..మిగతా 2లో



## కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

2




## గ్యాస్ ధర సిలిండర్‌కు
# రూ.50 పెంపు


### మరోమారు వాతలు పెట్టిన కేంద్రం
### పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాలు అదనం

**న్యూఢిల్లీ హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** పెట్రోల ధరలతో పాటు, గ్యాస్ ధరలు భగ్గుమన్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసాక మరోమారు కేంద్రం వాతలు పెట్టింది. ధరలతో మరోమారు సామాన్యులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇప్పటికే పెరిగిన ధరలతో కుదేలవుతున్న సగటు జీవిపై ధరలమోత పడనుంది. వంట గ్యాస్‌పై ఒక్కో సిలండర్‌పై రూ.50

..మిగతా 2లో

# మార్కెట్లో మండే మంటలు

### భారీగా నష్టపోయిన సూచీలు
### సెన్సెక్స్ 3 వేలు... నిఫ్టీ వేయికి పైగా పాయింట్ల పతనం



**ముంబై, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. మండే మంటలతో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఉదయం మిశ్రమంగా మొదలయిన సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో ప్రారంభం కాగా, బ్యాంక్ నిఫ్టీ, బ్యాంకెక్స్, ఫిన్ నిఫ్టీ స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. అయితే అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో నిమిషాల వ్యవధిలో మార్కెట్లు పతనం ప్రారంభమైంది. అదే కొనసాగి చివరికి భారీ స్థాయిలో ఇండెక్సులు కింద పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లన్నీ నష్టాలు నమోదు చేయగా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్లు- ముగిసే వారాంతానికి సెన్సెక్స్ 930.67 పాయింట్లు-, నిఫ్టీ భారీగా 345.65 పాయింట్లు-, బ్యాంక్ నిఫ్టీ స్వల్పంగా 94.65 పాయింట్లు కోల్పోయాయి. అటు ఆసియా మార్కెట్లు కూడా నష్టాల్లో ముగిశాయి. జపాన్ నిక్కీ భారీగా 2.67 శాతం నష్టంతో ముగియగా, హాంకాంగ్ హాంగె సెంగ్ 1.55 శాతం నష్టంతో ముగిశాయి. ఈ క్రమంలోనే భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా పతనమయ్యాయి. రికార్డు స్థాయిలో సెన్సెక్స్ 3వేల పాయింట్లు- పతనం కాగా.. నిఫ్టీ వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో పాటు అమెరికా స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. హాంకాంగ్, చైనా మార్కెట్లు- దాదాపు 10శాతం పతనమ్యాయి. ఈ భయాలు దేశీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే సోమవారం ప్రారంభంలోనే సెన్సెక్స్ 3వేల పాయింట్లుకుపైగా

..మిగతా 2లో




## ప్రధాని మోడీ
# పదవి వ్యామోహ పిశాచి

### మహేశ్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం కుట్ర పన్నుతోందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పునర్విభనజపై కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ టూరిజం ప్లాజాలో ఇవాళ అఖిలపక్షం ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ పునర్విభజన – దక్షిణ భారత భవిష్యత్ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిలిమిటేషన్‌పై చర్చించకుంటే చరిత్ర క్షమించదని ఈ విషయంలో పార్టీలకు అతీతంగా కొట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డిలిమిటేషన్ పేరుతో దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్పించేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. 1971 నాటి జనాభా లెక్కల ప్రకారం ఏర్పడిన పార్లమెంటరీ నియోజకవర్గాలను కేంద్రం ఇప్పటివరకు స్తంభింపచేసిందని దీన్నే మరో 25 సంవత్సరాల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. డిలిమిటేషన్ పై అసెంబ్లీలో తీర్మానం

..మిగతా 2లో



## కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్‌లోని శాసన మండలిలో ఏప్రిల్ 7న ఏడుగురు ఎమ్మెల్సీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన నలుగురు ఎమ్మెల్సీలతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ నేతలు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సీపీఐ నుంచి ఎన్నికైన నెల్లికంటి సత్యం ప్రమాణం చేశారు. వీరితో పాటు పట్టభద్రుల,టీచర్ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య, శ్రీపాల్ రెడ్డిలు కూడా ప్రమాణం స్వీకారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మరో రోజు ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీజేపీ నుంచి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, లక్ష్మణ్ హాజరయ్యారు.

## పోలీసుల విచారణకు హాజరైన ప్రభాకర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటేను జంకుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ తీపికబురు చెప్పింది. రాగల మూడునాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ మధ్య బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని పేర్కొంది. రాగల 24గంటల్లో బంగాళాఖాతంలో వాయువ్య దిశగా పయనించనున్నది. అనంతరం 48గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇవాళ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. మంగళవారం, బుధవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఈ నెల 13 వరకు రాష్ట్రంలో పలుచోట్ల అక్కడక్కడ వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది.

## నేను ఎక్కడా ఫేక్ వీడియో సర్క్యులేట్ చేయలేదు : మన్నె క్రిశాంక్



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ డ్యామేజ్ కంట్రోల్ చేయడం ప్రారంభించిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. తాను చేసిన పోస్టుల్లో ఎక్కడా కూడా ఏఐని వాడలేదని స్పష్టం చేశారు. ఇటీవల హెచ్‌సీయూ విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు అన్నీ వాస్తవమే అని పేర్కొన్నారు. దీనిపై న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. జింకలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చాయి.. ఇళ్లలోకి ఎందుకు వెళ్లాయి.. అవన్నీ వీడియోలు ఉన్నాయని క్రిశాంత్ తెలిపారు. అక్కడ జింకలు లేవు, నక్కలు ఉన్నాయని అంటున్నారని విమర్శించారు. కంచె గచ్చిబౌలి భూముల్లోకి ఎవరూ రావవద్దని ఆంక్షలు పెట్టారని.. ఇప్పుడు ఏఐతో వీడియోలు సృష్టించారని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అసలు ఏఐ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. నిజంగానే అక్కడ జింకలు, నెమ్మళ్లు ఉన్నాయని జాతీయ స్థాయిలో నిరూపితమైందని తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తనపై నాలుగు కేసులు పెట్టిందని విమర్శించారు. జింకలు చనిపోవడానికి కారణమెవరు? ఆ చెట్లను నరకడానికి కారణం ఎవరని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. వీటికి కారణం ఎవరైనా వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ జింకలు లేవని అందరితో వీడియోలు పెట్టిస్తున్నారని.. ఒక్కొక్కరికీ రూ.20 వేలు ఇచ్చి రీల్స్ చేయిస్తున్నారని మండిపడ్డారు.

## టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న మహిళా సంఘాలు

### వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం అవగాహన

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వ్యవసాయ సాగు విస్తరణలో పంట తెగుళ్లను నిర్మూలించే పద్ధతిలో మహిళా విభాగం ముందుకెళ్తుంది. డ్రోన్ల సహాయంతో పిచికారి చేస్తూ సేద్యానికి మహిళా మణులు వెన్నుదన్నుగా నిలిచే సమయం రానే వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సంక్షేమ పథకం.. నమో డ్రోన్ దీదీ. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిగా సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలో అమలు కావడంతో విద్యావంతులైన డ్వాక్రా గ్రూప్ మహిళలు డ్రోన్లతో పిచికారి చేసే శిక్షణ పొందుతూ సబ్సిడీల రూపంలో జీవన ఉపాధి పొందుతున్నారు. రైతులకు డ్వాక్రా మహిళలు అండగా నిలవనున్నారు. వ్యవసాయ పనుల్లో వారికి సాయంగా నిలిచి డ్రోన్ల సాయంతో పురుగు మందులు, ఎరువులు పిచికారి చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా డ్వాక్రా మహిళలను వ్యవసాయ రంగంలో కూడా తీసుకొచ్చి వారికి జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలో ఈ పథకాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. ఈ పథకంతో విద్యావంతులైన మహిళలకు సబ్సిడీపై డ్రోన్లు అందించనున్నారు. వీటి నిర్వహణపై తొమ్మిది రోజులపాటు శిక్షణ ఇచ్చి వ్యవసాయ పనులు చేయిస్తారు. తొలి విడతగా జిల్లాలో ప్రతి మండలంలోని మూడు డ్వాక్రా గ్రూప్‌లలోని విద్యావంతుల్ని ఎంపిక చేస్తారు. వ్యవసాయ దిగుబడి వ్యయాన్ని తగ్గించడం, కూలీల సమస్యల అధిగమించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మహిళలకు మారుతున్న టెక్నాలజికి అనుగుణంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్న లక్ష్యంతో మహిళలకు ఈ బాధ్యతల్ని అప్పగిస్తున్నారు. దానికి అనుగుణంగా అధికారులు విద్యావంతులైన మహిళల్ని ఎంపిక చేసిన వారందరికీ శిక్షణ అందిస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఉత్పత్తి వ్యయం పెరగడంతో రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఎక్కువ ఖర్చు కూలీలు, ఎరువులు, మందులకే సరిపోతుంది. వీటితో పాటు కొన్ని సమయాల్లో పొలాల్లో మందులు పిచికారి చేసేందుకు కూలీలు సైతం చిక్కడం లేదని రైతులే పిచికారి చేసుకుని అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల వ్యవసాయ రంగంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం డ్రోన్లను తయారు చేసి వాటిని రైతులకు అందించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని భావించింది. దానికి అనుగుణంగా నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశ పెట్టిన కూటమి ప్రభుత్వం బయట వ్యక్తులకు కాకుండా మహిళల్ని వ్యవసాయ రంగానికి తీసుకొచ్చి వారికి జీవనోపాధి అవకాశాలు పెంచాలని భావించి ఈ బాధ్యతల్ని డ్వాక్రా మహిళలకు అప్పగిస్తే సమర్ధవంతంగా నిర్వహిస్తారని ప్రభుత్వం ఆలోచించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇక మహిళలకు అందించే డ్రోన్ల ఖరీదు రూ.10లక్షలు విలువ చేస్తుంది.. వీటిలో మహిళలు కేవలం 20శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 80శాతం ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తుందని అంటే రూ. పది లక్షల్లో మహిళలు రెండు లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.8లక్షలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని దాన్ని తిరిగి చెల్లించనవసరం లేదు అన్నారు. ఇక వీటిని ఎలా ఆపరేట్ చేయాలన్న దానిపై మహిళలకు ఆందోల్ జోగిపేట పట్టణంలోని మహిళా సమైక్యా భవనంలో 9 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరికి డ్రోన్లు ఏ విధంగా అమర్చాలి వాటిలో వచ్చే చిన్న చిన్న సాంకేతిక సమస్యలపై అవగాహన కల్పిస్తారు. ఇక రసాయనాలు, పురుగు మందుల్ని ఏ విధంగా కలిసి డ్రోన్లకు అమర్చాలి, వాటిని రిమోట్ కంట్రోల్ ద్వారా ఏ విధంగా ఆపరేట్‌పై తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు.

# వైభవంగా రామయ్య పట్టాభిషేకం





**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** భద్రాచలంలో శ్రీరాముల వారి మహాపట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా కళ్యాణ మండపంలో సీతరామచంద్రుడికి అర్చకులు పట్టాభిషేకం నిర్వహించారు. ఆదివారం భద్రాచాలంలో శ్రీసీతారాముల కళ్యాణం అత్యంగ కన్నులపండుగా జరిగింది. ప్రతీఏటా స్వాముల వారి కళ్యాణం అనంతరం మహాపట్టాభిషేకాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. శ్రీ రామ మహా పట్టాభిషేకంలో రాముల వారికి పట్టు వస్త్రాలను గవర్నర్ సమర్పించారు. పట్టాభిషేకంలో భాగంగా రాములవారికి పాదుకలను సమర్పించారు అర్చకులు. రాజదండం, రాజ ముద్రిక, రాజ ఖడ్గం, ఛత్రం, చామరలు, రామదాసు పచ్చల పతకాన్ని శ్రీరాముడికి అలంకరించారు. ఆపై ఆ రామయ్యకు కిరీటం ధరించారు. ఆ తరువాత వివిధ నదుల తీర్థాలతో సీతారామచంద్రయ్య భగవనాడుకి అభిషేకం క్రతువును నిర్వహించారు అర్చకులు. మహా పట్టాభిషేక మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆ రామయ్య పట్టాభిషేకాన్ని వీక్షించి పునీతులయ్యారు. రాత్రికి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో శ్రీరామనవమి మహా పట్టాభిషేకం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రం, దేశం పాడి పంటలతో సుసంపన్నంగా ఉండాలని కోదండ రాముడుని వేడుకున్నానని తెలిపారు. రాముల వారి కళ్యాణం పట్టాభిషేకం ఘనంగా నిర్వహించిన అధికారులకు, విచ్చేసిన భక్తులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాగా.. రాముల వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం సారపాకకు చేరుకున్న గవర్నర్‌కు హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఆపై మిథిలా కళ్యాణ మండపానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, మంత్రి తుమ్మల స్వాగతం పలికారు.

## ఆర్టీసీ కండక్టర్‌కు సీఎం బంపర్‌ఆఫర్



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం):** ఆరు అడుగుల బస్సులో ఏడు అడుగుల పొడవుతో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగి అమీన్ అహ్మద్ అన్సారీ గత వారం రోజులుగా నెట్టింట హల్‌చల్ చేస్తున్నాడు. బస్సు ఎత్తుకు మించి పొడవు ఉండటంతో విధులు నిర్వహించడం సవాల్‌గా మారిందని, తరచూ బస్సుల్లో రోజూ సగటున 5 ట్రిప్పుల్లో 10గంటల వరకు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయాడు. 195 సెం.మీ. ఎత్తుండే బస్సు లోపల 214 సెం.మీ. పొడవున్న తాను గంటల తరబడి తల వంచి ప్రయాణిస్తుండటం వల్ల మెడ, వెన్నునొప్పి, నిద్రలేమితో హాస్పిటల్స్?చుట్టూ తిరగాల్సి వస్తోందని తన గోడు విన్నవించుకున్నాడు. ఇందుకు సంబంధించిన వార్తలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అతడికి ఆర్టీసీలోనే మరేదైనా ఉద్యోగం ఇచ్చేలా చూడాలని ప్రయాణికులు సైతం విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో ఏడడుగుల కండక్టర్ సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. అతడికి ఆర్టీసీలోనే వేరే ఉద్యోగం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కండక్టర్‌కు వేరే ఉద్యోగం ఇవ్వాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను మంత్రి పొన్నం ఆదేశించారు.



## సింగపూర్‌తో కలసి పనిచేస్తాం

మొదటి పేజీ తరువాయి...

మర్యాదపూర్వకంగా కలిసింది. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామని అన్నారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి వివరించారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయని అన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతుంది. ఏడాది వ్యవధిలోనే ఐటీ-, హాస్పిటాలిటీ-, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని ఈ సందర్భంగా వారికి వివరించారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం అని శ్రీధర్‌బాబు వివరించారు.

## గ్యాస్ ధర సిలిండర్‌కు రూ.50 పెంపు

మొదటి పేజీ తరువాయి...



పెంచింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీ సోమవారం న్యూఢిల్లీలో వెల్లడించారు. ఈ పెంపు ధర ఉజ్వల్ యోజన పథకం ద్వారా సిలండర్ పొందుతున్న లబ్ధిదారులకు సైతం వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీంతో 14.2 కేజీ ఎల్పీజీ సిలండర్ ధర ప్రస్తుతం రూ. 803 ఉంటే.. ఇకపై దీని ధర రూ. 853 అవుతుందని తెలిపారు. అలాగే ఉజ్వల్ యోజన పథకం కింద అందుకొంటున్న సిలండర్ ధర రూ. 503 నుంచి రూ. 553కు పెరిగిందని వివరించారు. ఇక ప్రతి 15 రోజులకు లేదా ఒక నెలకు.. ఈ ధరలపై సమీక్షిస్తామన్నారు. 2024, ఆగస్ట్ నుంచి ఇప్పటి వరకు 14.2 కిలోల సిలిండర్ ధరలు పెంచలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలను సైతం కేంద్రం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. లీటర్‌కు ఏకంగా రూ. 2 మేర పెంచింది. ఈ ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. అయితే పెరిగిన ఈ పెట్రోల్, డీజిల్ ధరలు.. వాహనదారులపై పడవని కేంద్రం స్పష్టంగా పేర్కొంది. ఆ యా ధరలు ఆయిల్ కంపెనీలపై పడుతోందని వివరించింది. కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ జ్ సుంకాన్ని ఒక్కొక్కటి రూ. 2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం భారతదేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్ ధరలలో గణనీయమైన తగ్గుదలకు దారితీసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ,హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ , దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల రిటైల్ మార్కెటింగ్, పంపిణీకి ప్రధాన భూమిక వహిస్తాయి. ఈ ప్రకటన తర్వాత, ఆయా ఆయిల్ కంపెనీల స్టాక్ ధరలు భారీగా తగ్గాయి. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ. 13 కు పెంచుతామని, డీజిల్‌పై లీటరుకు రూ. 10 కు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. పెరుగుదల లాభదాయకతపై ప్రభావం చూపుతుందని పెట్టు-బడిదారులు భావిస్తున్నారు. ఎందుకంటే అధిక సుంకాలు సాధారణంగా వినియోగదారుల ఖర్చులను పెంచుతాయి. అదే సమయంలో డిమాండ్‌ను తగ్గించే అవకాశం ఉంది. ఈ చర్య స్టాక్ మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పెట్రోలియం రంగంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కంపెనీలకు. సుంకం పెంపు అంటే వినియోగదారులకు అధిక ఖర్చులు, ఇది ఇంధన డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. ఇది ఇఈఠ, ఐఈఠ మరియు ఒక్షఈ వంటి చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకతను ప్రభావితం చేస్తుంది. అందుకనే ఆయా కంపెనీల షేర్ ధరలు పడిపోయాయి.



## మార్కెట్లో మండే మంటలు

మొదటి పేజీ తరువాయి...

పతనమైంది. నిఫ్టీ వెయ్యి పాయింట్లకుపైగా తగ్గింది.ఏప్రిల్ 4న బీఎస్ఈలో జాబితా అయిన అన్ని షేర్ల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.4,03,34,886.46 కోట్లు- ఉండగా.. నేడు మార్కెట్లు ప్రారంభమైన కొద్దిసేపటికి రూ.3,83,95,173.56 కోట్లకు తగ్గింది. ప్రారంభంలోనే పెట్టుబడిదారుల మూలధనం రూ.19,39,712.9 కోట్ల సంపద ఆవిరైంది. సెన్సెక్స్‌లో భారతి ఎయిర్టెల్ మాత్రమే గ్రీన్ జోన్‌లో ఉంది. కానీ, కేవలం ఒకశాతం కంటే తక్కువగానే పెరిగింది. మరో వైపు ఇన్ఫోసిస్, టాటా మోటార్స్ భారీ నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈలో 2289 షేర్లు ట్రేడవుతున్నాయి. ఇందులో 1,029 స్టాక్‌లు బలంగా కనిపిస్తున్నా.. 1,101 నష్టాల్లో కొనసాగుతున్నాయి. 24 షేర్లు ఒక సంవత్సరం గరిష్ట స్థాయికి, 23 షేర్లు ఒక సంవత్సరం కనిష్ఠానికి చేరాయి. ప్రస్తుతం నిఫ్టీలో గోద్రెజ్ కన్స్యూమర్, -టె-ంట్ ఫార్మా మాత్రమే లాభాల్లో ఉండగా.. -టె-ంట్, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఓఎన్‌జీసీ, హెచ్‌సీఎల్ -టె-క్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జియో ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, అదానీ పోర్ట్స్ భారీగా నష్టాల్లో కొనసాగుతున్నాయి.

## ప్రధాని మోడీ పదవి వ్యామోహ పిశాచి

మొదటి పేజీ తరువాయి...

చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ఒప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు.

**మతం పేరుతో గెలిచి తెచ్చింది గుండు సున్నా:**

తెలంగాణలో మతం పేరుతో 8 మంది ఎమ్మెల్యేలు, 8 ఎంపీలు గెలిచిన బీజేపీ రాష్ట్రానికి తెచ్చిన నిధులు గుండు సున్నా అని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. దేవుడికి, రాజకీయాలకు ముడిపెట్టే బీజేపీ పార్టీని తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాల తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడి ఈ బీజేపీ ఫాసిస్టు విధానాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. 11 సంవత్సరాలు పాలించిన నరేంద్ర మోడీ దేశానికి చేసింది ఏమీ లేదని కుల మతాలు మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని మాత్రమే బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రధాని మోడీ పదవి వ్యామోహం పిశాచి అని రష్యా అధినేత పుతిన్ వలే నియంతలా దేశాన్ని పాలించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి

**సినీ నటులు బాలిరెడ్డి పృథ్వీరాజ్**



క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభిస్తున్న సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, మురళీధర్ అమరనాథ్ లు



క్రికెట్ పోటీలకు హాజరైన సినీ నటుడు శుభోదయం సుబ్బారావు (రాజశేఖర్), రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్







సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, మురళీధర్ అమరనాథ్ లకు సన్మానం



మేకల దామోదర్ రెడ్డికి సన్మానం

రాజేంద్రనగర్, ఏప్రిల్7 (ప్రభాత ఉదయం) సమాజానికి మేలు చేయడానికి ఎంతటి కష్టమైన భయపడకుండ ముందుకు సాగుతు విధి నిర్వాహణ లో ముందుండి పనిచేసే వారు జర్నలిస్టులు అని సినీ నటుడు బాలిరెడ్డి పృథ్వీరాజ్ అన్నారు. ఫ్రెండ్స్ క్రికెట్ అసోసియేషన్ పేరుతో రాజేం ద్రనగర్ జర్నలిస్టులు సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. జర్నలిస్టు కుటుంబ సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. వారందరికి సినీ నటులు బాలిరెడ్డి పృద్వీరాజ్ తో పాటు సీనియర్ పాత్రికేయులు మ్యాడం మదుసూదన్, మురళీధర్ అమర్నాథ్ లు బహుమతులు అందజేశారు. మహిళలకు చీరలను బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మ్యాడం మదుసూదన్, మురళీధర్ అమర్నాథ్ లు , మాట్లాడుతూ, జర్నలిస్టులు రాసే ప్రతి వార్త సమాజానికి ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. జర్నలిస్టులు సమాజానికి జవాబుదారిగా ఉండాలని సూచించారు. పోటీల సం దర్భంగా సినీ నటులు, కోర్టు సినిమాలో నటించిన శుభోదయం సుబ్బారావు(రాజశేఖర్) రాజేం ద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్. అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ లు క్యాస్ట్రో, నాగేశ్వర్ రావులు క్రికెట్, మ్యూజికల్ చైర్స్ పోటీలను సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, మురళీధర్ అమర్నాథ్ లతో కలసి ప్రారంభించారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో






గెలిచిన ఆనందంలో...

బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి తో పాటు సీనియర్ పాత్రికేయులు బచ్చు అంజయ్య గుప్తా, ఏపీ చారి, మేకల దామోదర్ రెడ్డి , ఎ.భీమయ్య. ఎం.బాలసుబ్రమణ్యం, బుడిగెల బాబురావు, ఎం.ప్రేంరాజ్ లు పాల్గొన్నారు.

### క్రికెట్ ట్రోఫీని గెలుచుకున్న శ్రీకాంత్ జట్టు :

క్రికెట్ పోటీలలో శ్రీకాంత్ కెప్టెన్ గా ఉన్న జట్టు విజయం సాదించగా, వర్కాల చందు కెప్టెన్ గా ఉన్న జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జర్నలిస్టు కుటుంబ సభ్యులకు సైతం పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. జర్నలిస్టు కరుణాకర్ కుమార్తె వైశాలి చేసిన నృత్యం సభికులను ఆకట్టుకుంది. జర్నలిస్టులు ఎం.బాలసుబ్రమణ్యం, గద్దె యాదగిరి ల కుమార్తెలు ఎం.తరుణీ, మహాలక్ష్మీలు లు చేసిన నృత్యాలు ఎంతగానో అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాత్రికేయులు కోట్ల చంద్రకాంత్, కోరని మహేశ్, సుదర్శన్ గౌడ్, అనిల్, మాసయ్య, శ్రీకాంత్ గౌడ్, మోసిన్, ఇంద్రసేనా, గోంగుర శ్రీనివాస్, పవన్ భారతి, సందీప్ కపూర్, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### పోటీలకు అన్ని తానై నడిపించిన మేకల దామోదర్ రెడ్డి :

క్రికెట్ పోటీల నిర్వాహణకు ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి అన్ని తానై నడిపించారు. పోటీలకు ఆయనతో పాటు సీనియర్ పాత్రికేయులు బచ్చు అంజయ్య గుప్తా, ఏపీ చారి , కరుణాకర్ సాగర్, సుదర్శన్ గౌడ్, పవన్ భారతి లు కూడా సహకరించారు.













బహుమతుల ప్రధానోత్సవం, జర్నలిస్టుల కుటుంబ సభ్యులు




మాట్లాడుతున్న సినీ నటులు బాలిరెడ్డి పృథ్వీ రాజ్

# పోటీల నిర్వహణతో సంతోషం వ్యక్తం చేసిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు



క్రికెట్ పోటీలలో పాల్గొన్న అత్తాపూర్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వర్ రావు



పాత్రికేయులు భీమయ్య సతీమణి మాధవికి చీరను బహుకరిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి



బహుమతుల ప్రదానం





బహుమతుల ప్రదానం



జర్నలిస్టుల కుటుంబ సభ్యులు

బుద్వేల్, ఏప్రిల్ 7(ప్రభాత ఉదయం): జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఆటల పోటీలో నిర్వహించడం సంతోషంగా ఉందని జర్నలిస్టు కుటుంబ సభ్యులు ఎం సౌజన్య , ఎ .శ్రీలక్ష్మి , ఎ .మాధవి లు తెలిపారు. సోమవారం జన్మదినం జరుపుకుంటున్న జర్నలిస్టు శ్రీకాంత్ సతీమణి స్వాతీ కి జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

### పోటీలను ప్రారంభించిన అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు

జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు నిర్వహించిన వివిధ రకాల పోటీలను అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వరరావు ప్రారంభించారు. జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



బిజెపి ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ జెండా ఎగరవేస్తున్న జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

# బిజెపితోనే దేశ సమగ్ర అభివృద్ధి

**బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్**

రాజేంద్రనగర్,ఏప్రిల్ 07(ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో బీజేపీ 45వ వ్యవస్థాపక దినోత్సవ జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,మక్తల్ ప్రభారి రాష్ట్ర మాజీ యువమోర్చా కార్యదర్శి బొక్క బాల్ రెడ్డి,లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...1980 ఏప్రిల్ 6వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు.నాటి నుండి నేటి వరకు నేషన్ ఫస్ట్,పార్టీ సెకండ్,సెల్ఫ్ లాస్ట్ అనే నినాదంతో ముందుకు వెళ్తూ అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆధారంగా పనిచేస్తూ,పార్టీ 2 ఎంపీ సీట్లతో ప్రారంభమై,నేడు 15 రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామంటే,కోట్లలాది మంది కార్యకర్తల నిబద్ధత,జాతీయభావం కారణంగా పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేసిన నాయకులు,కార్యకర్తలందరినీ స్మరణ చేసుకుంటూ కార్యకర్తలందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుద్వేల్,రాజేంద్రనగర్ అంబెద్కర్ చౌరస్తాలో బీజేపీ జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నరాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు కోరని సదానందం,డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ,కోరని క్రాంతి, రాఘవేంద్ర చారి,రాపర్తి రాకేష్ గౌడ్,డి.రాజ్ కుమార్ యాదవ్,బెక్కం గోపాల్,శేఖర్ గౌడ్,సాయికుమార్,తొండుపల్లి మల్లేష్,డి.శ్రీధర్ యాదవ్,రఘుమారెడ్డి, సరితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గుణవర్ధన్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ ఎం భీమ్ రెడ్డి

# గుణ వర్ధన్ నూతన గృహ ప్రవేశం పూజల్లో పాల్గొన్న సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి

కొత్త కోట, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం) కొత్త కోట శ్రీ ఎస్ వి ఎస్ ఐ టి ఐ కళాశాల ప్రిన్సిపాల్ గుణవర్ధన్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశం పూజల్లో కొత్త కోట మండల సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పూజా కార్యక్రమంలో బి హెచ్ ఈ ఎల్ రిటైర్డ్ ఈడి ఏ ఎం వి యుగంధర్,దినేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

# కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**

రాజేంద్రనగర్,ఏప్రిల్07(ప్రభాత ఉదయం) కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాటేదాన్ చౌరస్తాలో గల ఫుటోవర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారిందని,ప్రజలకు వినియోగపడే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు.ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటేదాన్‌లోని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు.కాటేదాన్ స్వప్న టాకీస్ దగ్గర యూటర్న్ ఉన్న చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరుపయోగకరంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ దేనికి పనికి రాకుండా నిర్మించారన్నారు.హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆగమేఘాల మీద స్వయంగా వచ్చి ప్రారంభించారని,ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని వివరించారు.తాగుబోతులకు అడ్డగా మారిందని,కోట్ల రూపాయల కార్పొరేషన్ నిధులతో నిర్మించిన ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రజాధనాన్ని వృధాగా చేశారన్నారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోనే నివాసముంటున్న కార్పొరేటర్,ఎమ్మెల్యేని ఉన్నత అధికారులు అవగాహన లేకుండా వేశారన్నారు.ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి జిల్లా పరిషత్ హైస్కూల్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ ముందు వేసినట్లయితే మరి చదువుకున్న పిల్లలకు పాదాచారులకు ఉపయోగకరంగా ఉండేదని,అక్కడ కొంత మంది యాక్సిడెంట్ కారణంగా ప్రాణాలు విడిచి చనిపోవడం జరిగిందని తెలిపారు.మరికొందరు వైకల్యం పాలైనట్లు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సాయిబాబా నగర్,మార్కండేయనగర్ బాబుల రెడ్డినగర్ ,మైలార్ దేవ్ పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ ముందు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ వేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ,రాము యాదవ్,రమేష్ ముదిరాజ్,మైసిరెడ్డి,రాఘవేందర్ యాదవ్,ఎల్ రాజు,అరుణ్ ముదిరాజ్,రాజు,ఉప్పల్ శ్రీను,సురేష్ ముదిరాజ్,వెంకటరమణ, భగవాన్ దాస్,బాలరాజ్ యాదవ్,అశోక్ కుమార్,కార్తీక్ ముదిరాజ్,క్రాంతి,రాజ్ కుమార్, సునీల్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద వెంకటేష్, బి ఆర్ ఎస్ నాయకులు



ప్రజావాణిలో ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ సంతోష్

# ప్రజావాణిలో వచ్చిన ప్రజల వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించాలి

## కలెక్టర్ సంతోష్

### 37 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు వెల్లడి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7(ప్రభాత ఉదయం)ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (37) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ అర్జీలను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు.వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ రావు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్ల నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7(ప్రభాత ఉదయం)మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా గ్రామాలలో నిర్మించిన సీసీ రోడ్లు నాణ్యత పాటించలేదని గట్టు మండలం ప్రజలు ఆరోపించారు. గట్టు మండల పరిధిలో గట్టు,మాచర్ల, ఇందువాసి ,మల్లంపల్లి రాయపురం, అంతంపల్లి, చాగదోన, బోయలగూడెం ముచ్చోనిపల్లి, గొర్లఖాన్ దొడ్డి, 2024- 25 సంవత్సరం నందు ఎన్ఆర్ ఇ జిఎస్ కింద మార్చి నెలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారని, నాణ్యత పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారంటూ ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు వినతిపత్రం అందించారు. తక్కువ సిమెంట్ తో, డస్ట్ తో ఎక్కువ పర్సంటేజ్ 12ఎంఎం మెటల్ కలిపి నిర్మాణాలు చేపట్టారని, ఈ సిసి రోడ్ల నిర్మాణం కోసం సంబంధిత గ్రామాల కూలీలను ఉపయోగించకుండా మిషనరీష్ చేపట్టారని వారు ఆరోపించారు. సంబంధిత ఇంజనీర్ అధికారులకు దృష్టికి తీసుకొచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అధికారులు కాంట్రాక్టర్ తో అవినీతికి పాల్పడుతున్నారని, విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాణ్యత పాటించని కాంటాక్టు, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నరు. ఈ కార్యక్రమంలో అంతంపల్లి ఆంజనేయులు, వీరేష్ ,మల్లకల్, గోవిందు, ఉన్నారు.

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్

### కొహెడలో 199.12 ఎకరాల్లో నిర్మించడానికి ప్రతిపాదనలు



హైదరాబాద్, ఏప్రిల్ 7(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ఉద్యాన పంటలను దృష్టిలో ఉంచుకుని, అలాగే భవిష్యత్తులో పండ్ల ఎగుమతి, దిగుమతులకు తగ్గట్లు.. అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ స్థాయిలో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ శివార్లలోని కొహెడలో రూ.1,901.17 కోట్లతో 199.12 ఎకరాల్లో అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ నిర్మించడానికి ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. మార్కెటింగ్‌శాఖ డిటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం అనంతరం పనులు మొదలుకానున్నాయి. 1986లో హైదరాబాద్‌లోని కొత్తపేటలో 22 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. రద్దీ సమస్య దృష్ట్యా దాన్ని 2021లో కొహెడకు తరలించారు. తాత్కాలిక షెడ్లను నిర్మించగా వర్షాలు, గాలికి కూలిపోయాయి. దీంతో మార్కెట్‌ను బాటసింగారం హెచ్‌ఎండీఏ లాజిస్టిక్ పార్కులోకి మార్చారు. ఇప్పుడు కొహెడలో ఏకంగా 199 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నడుంబిగించింది. ప్రస్తుతం దిల్లీలో 100 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ ఉంది. కొహెడలో మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే.. ఢిల్లీని మించి దేశంలోనే అతి పెద్ద ఫ్రూట్ మార్కెట్‌గా హైదరాబాద్ నిలుస్తుంది. 48.71 ఎకరాల్లో పండ్ల వ్యాపారానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తారు. రోడ్ల కోసం 56.05 ఎకరాలు కేటాయించారు. టోల్‌గేట్, నాలా, గ్రామరోడ్డు వంటివాటికి 17.27 ఎకరాలు, పార్కింగ్ స్థలానికి 16.59 ఎకరాలు కేటాయిస్తారు. పూలు, డ్రైఫ్రూట్స్, పాడి, చేపలు, పౌల్ట్రీ, మాంసం, ఫ్రోజెన్, ప్యాక్డ్ బాటిల్ ఫుడ్స్ వంటి ఉత్పత్తులకు 10.98, కోల్డ్‌స్టోరేజీలకు 9.50 ఎకరాలు కేటాయించనున్నారు. వీటితో పాటు.. పండ్ల రిటైల్ జోన్, సామగ్రి నిల్వ, ప్రాథమిక శుద్ధి, వివిధ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పరిపాలన భవనం, ప్రయోగశాలలు, విశ్రాంతిగృహాలు, అగ్నిమాపక, పోలీసుస్టేషన్, ఆరోగ్యకేంద్రం, దుకాణాల సముదాయం, ఘనవ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి నిర్మాణాలు చేపడతారు. వంద అడుగుల ఎత్తులో 19,375 చదరపు అడుగుల స్థలంలో నిర్మించే టవర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 4 అంతస్తులను వ్యాపార సంస్థలకు కేటాయిస్తారు. ఆరు హై-స్పీడ్ ప్యాసింజర్ లిఫ్ట్‌లు, హెలిప్యాడ్‌లు ఉంటాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య, ఎగుమతి సంస్థలకు లీజుపై స్థలాలను కేటాయించనున్నారు. రూ.350 కోట్లను భూసేకరణకు వెచ్చిస్తున్నారు. రూ.1,694.74 కోట్లతో నిర్మాణ పనులు, ఐటీ సౌకర్యాలు కల్పిస్తారు.

# ఉచిత సన్న బియ్యం పథకం పేద ప్రజలకు వరం

### మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత

### కేటిదొడ్డి మండల కేంద్రంలో పేదల ఇంట భోజనం చేసిన మాజీ జెడ్పీ చైర్ పర్సన్



కేటి దొడ్డి మండల కేంద్రంలో దళిత మహిళ ఇంట్లో భోజనం చేస్తున్న మాజీ జెడ్పి చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7(ప్రభాత ఉదయం) ఉచిత సన్న బియ్యం పథకం పేద ప్రజలకు వరం అని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రేషన్ బియ్యం పంపిణి కార్యక్రమంలో భాగంగా సన్న బియ్యంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఏదో ఒకరోజు లబ్ధిదారుల ఇళ్లలో భోజనం చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే సోమవారం కేటిదొడ్డి మండల కేంద్రంలో సన్న బియ్యం లబ్ధిదారులు హరిజన ముద్దమ్మ తిప్పన్న ఇంట్లో మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు హాజరై లబ్ధిదారుల ఇంట్లో సన్న బియ్యం భోజనం చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. రేషన్ షాపులో తెచ్చుకున్న సన్న బియ్యం బాగున్నాయా అని ప్రశ్నించారు. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన వర్గాల నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. పేదల ఇంట వండిన సన్న బియ్యం బువ్వ తింటుంటే ఎంతో ఆనందంగా ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతపాలెం ఆనంద్ గౌడ్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, గుంతబాయి శ్రీను, తిరుపతి, సూరి, సురప్ప, రామకృష్ణ, నందిన్నె ఆంజనేయులు, పటేల్ శ్రీనివాసులు, వెంకటేష్ నాయుడు,యర్సన్ దొడ్డి గోవింద్, రాఘవేంద్ర, నరేష్,కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,పద్మరెడ్డి, రంగస్వామి,రాజారెడ్డి, రహీం,జంగిలప్ప, సిద్దన్ గౌడ్, మహదేవ్, రామన్ గౌడ్, మహేష్, తాయన్న, డికేసాయన్న, నర్సింహులు తదితరులు ఉన్నారు.



వైశాలి నృత్యం



తరుణ్య నృత్యం



మహాలక్ష్మి డ్యాన్స్

# జర్నలిస్టుల క్రికెట్ పోటీల సందర్భంగా ఆడి పాడిన చిన్నారులు

బుద్వేల్, ఏప్రిల్ 7 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ జర్నలిస్ట్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా వారి పిల్లలు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కరుణాకర్ కుమార్తె వైశాలి, బాలు కుమార్తె తరుణ్య, గద్దె యాదగిరి కుమార్తె మహాలక్ష్మి లు తమ నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి బహుమతులు అందచేశారు.

# ఉపాధ్యాయుడి ప్రాణాలు తీసిన ధూమపానం

కోదాడ, ఏప్రిల్7 (ప్రభాత ఉదయం) ధూమపానం ఓ ఉపాధ్యాయుడి ప్రాణాలు హరించింది. మద్యం మత్తులో సిగరెట్ వెలిగించిన ఓ ఉపాధ్యాయుడు దానిని ఆర్పివేయకుండా అలాగే నిద్రలోకి జారుకున్నాడు. దీంతో సిగరెట్ వల్ల మంటలు చెలరేగి ఆ ఉపాధ్యాయుడి సజీవ దహనమయ్యాడు.ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మంగలి తండాకు చెందిన ధరావత్ బాలాజీ (52) నడిగూడెం మండలం చెన్నకేశవాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉండడంతో మద్యం సేవించారు. సిగరెట్ తాగుతూ మంచంపై ఆరుబయట మంచంపై పడుకున్నారు. మత్తులో నిద్రలోకి జారుకోవడంతో సిగరెట్ మంచం నవారుపై పడి మంటలు చెలరేగాయి. దానికి కూలర్ గాలి తోడవడంతో భారీగా ఎగసిపడ్డాయి. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం, బాలాజీ మద్యం మత్తులో ఉండటంతో శరీరానికి మంటలు అంటుకుని అక్కడికక్కడే మృతిచెందారు. బాలాజీ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.



# పేదల ఆకలి తీర్చడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమవంత్ రెడ్డి

### మాజీ జడ్పీటీసీ కరుణసాగర్ రావ్

చెన్నూరు, ఎప్రిల్ 07. (ప్రభాత ఉదయం) పేదలకు సన్నబియ్యం అందించి వాళ్ళ ఆకలి తీర్చడానికి ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం రోజున మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కొమ్మెర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షుడు ముత్యాల బపుగౌడ్,మాజీ జడ్పీటిసి కరుణసాగర్ రావ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హిమవంతు రెడ్డి అధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ రాష్ట్రంలోని పేదల కడుపు నింపేందుకు ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంట శంకర్, రాజా గౌడ్, పవన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహేశ్వరం హత్య కేసును ఛేదించిన పోలీసులు

హైదరాబాద్, ఎప్రిల్ 07. (ప్రభాత ఉదయం) యాక్సిడెంట్ ముసుగులో జరిగిన హత్య రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో కలకలం రేపుతోంది. భూతగాదాల వివాదంలో శంకరయ్య అనే వ్యక్తిని హత్య చేశారు సోదరులు. పథకం ప్రకారమే హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వరసకు అన్నదమ్ములు అయ్యే వ్యక్తుల మధ్య భూ తగాదా హత్యకు దారి తీసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆస్తి కోసం అన్నను హత్య చేసి యాక్సిడెంట్‌గా మలిచే ప్రయత్నం చేశారు, కానీ చివరకు దొరికిపోయారు. ఈ నెల రెండో తేదీన కోల్వకల్ గేట్ దగ్గర బైక్‌పై వెళ్తున్న శంకరయ్యను వెనకాల నుంచి కారుతో ఢీకొట్టి చంపారు నిందితులు. 30 ఏళ్లుగా మృతుడు గూడెపు శంకరయ్య, గూడెపు నర్సింగ్‌రావుల మధ్య భూవివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శంకరయ్యపై గతంలోనూ దాడులకు పాల్పడ్డారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఇరుపక్షాలపై కేసులు కూడా నమోదయ్యాయి. కొద్ది రోజుల క్రితం కోర్టు శంకరయ్యకు అనుకూలంగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో ఆయన సోదరుల్లో ఆగ్రహం కట్ట తెంచుకుంది. శంకరయ్యను ఎలాగైన హత్య చేయాలని ప్లాన్ వేశారు. ఇందుకోసం ప్రశాంత్ అనే వ్యక్తితో డీల్ కుదుర్చుకున్నారు. ప్రశాంత్‌కు ఉన్న 12 లక్షల రూపాయల అప్పు తీర్చడంతో పాటు ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అంగీకరించిన ప్రశాంత్.. ఈ నెల రెండో తేదీన కోల్వకల్ గేట్ దగ్గర బైక్‌పై వెళ్తున్న శంకరయ్యను వెనకాల నుంచి కారుతో ఢీకొట్టాడు. దీంతో శంకరయ్య ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది శంకరయ్య భార్య కమల. ఈ క్రమంలో భిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్ పరిశీలించి.. చివరకు ఇది ప్రమాదం కాదు, హత్య అని తేల్చారు. ఈ కేసులో కొండని ప్రశాంత్, గూడెపు నర్సింగరావు, గూడెపు శ్రీనివాస్, కార్తీక్, కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. గూడెపు నర్సింగ్‌రావుకు తనకు సోదరుడి వరసయ్యే గూడెపు శంకరయ్యను కావాలనే హత్య చేయించినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608